ప్రమాదమని తెలిసినా స్పందించరా..?

• కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మారుతీనగర్, మార్చి 22 : ప్రమాదమని తెలిసినా స్పందించరా..? అంటూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం 'గుడ్‌మార్నింగ్ కోరుట్ల' కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని 17వ వార్డులో పలు కాలనీల్లో పర్యటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రమాదంగా ఉన్న మురుగు కాల్వను చూసి, అధికారులపై మండిపడ్డారు. నీటి ఎద్దడి లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఏనుగందుల వనజ, నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, తదితరులు ఉన్నారు.

సామాజిక సేవలతోనే గుర్తింపు

మల్లాపూర్, మార్చి 22: గ్రామాల్లో సామాజిక సేవలతోనే సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. సిరిపూర్ సింగిల్ విండో చైర్మన్ బద్దం అంజిరెడ్డి తన సొంత ఖర్చులతో తండ్రి తుక్కారెడ్డి, సోదరుడు అనిల్‌రెడ్డి జ్ఞాపకార్థం నడికుడ గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణం, సిరిపూర్ గ్రామంలో వైకుంఠరథాన్ని ఏర్పాటు చేశారు. కాగా, వీటిని శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిరిపూర్, నడికుడ గ్రామస్తులకు అంజిరెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సామాజిక సేవలో తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసానిచ్చారు. ఇక్కడ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలోని 17వ వార్డులో మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది ఏమనగా మా క్లైంట్ అయిన శ్రీ తిప్పని మధుకర్, తండ్రి పేరు: రాయమల్లు, వయస్సు: 36 సం||లు, నివాసం: ఇంటి నం: 4-98, నాయక్ పల్లి, కనగర్తి గ్రామం, పెద్దపల్లి మండలము & జిల్లా, తెలంగాణ రాష్ట్రం, అను వారు శ్రీ తాళ్లూరి సత్యనారాయణ, తండ్రి పేరు: కీ.శే. వెంకట నర్సయ్య, నివాసం: అప్పన్నపేట్ గ్రామం, పెద్దపల్లి మండలము & జిల్లా, తెలంగాణ రాష్ట్రం, అను వారికి వీరి తల్లిదండ్రుల నుండి వారసత్వముగా సంక్రమించిన ఈ క్రింద షెడ్యూల్లో పేర్కొనబడిన ఆస్తిని కొనుగోలు చేయుటకు విక్రయ ఒప్పందం కుదుర్చుకొని కొంత డబ్బు బయనాగా చెల్లించినారు. వీరి సోదరుడు అయిన శ్రీ తాళ్లూరి శ్రీధర్ గారు నుండి హక్కు విడుదల దస్తావేజు నం: 1190/2024, SRO Peddapalli, తేది: 20-03-2024 ద్వార సంపూర్ణ హక్కులు/యాజమాన్య హక్కులు కలిగి వున్నారు.

: షెడ్యూల్ ఆస్తి వివరములు :

అప్పన్నపేట్ గ్రామ రెవిన్యూ శివారు యందలి సర్వే నం. 774, లోని ప్లాటు నం. 217 (Part) మరియు 243 (Part), RCC House bearing No. 1-145/10, విస్తీర్ణము: 159.98 Sq.yds, ఇట్టి ఆస్తి/ప్లాటుకు హద్దులు: ఉత్తరము: ప్లాటు నం. 218 మరియు 242, దక్షణము: నం. 216 మరియు 244, తూర్పు: 33' ఫీట్ల జి.పి. రోడ్ మరియు చిలుకూరి రాజయ్య ప్లాటు నం. 243 (Part), పడమర: చంద్ర మోహన్ ప్లాటు నం. 217 (Part)

కావున ఇట్టి విక్రయ ఒప్పందం పైన ఎవరికైనా హక్కులు గాని, అభ్యంతరములు గాని వున్న యెడల సంబంధిత పత్రములతో/ఆధారములతో ఈ క్రింద చిరునామాలో గల వారికి (07) రోజులలో సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లైంట్ మిగితా విక్రయ డబ్బులు చెల్లించి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు, గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు చెల్లనేరవు.

Date: 23-03-2024 Place: Peddapalli

ఇట్లు: Sd/- అమిరిశెట్టి కృష్ణ, న్యాయవాది
ఇ.నెం. 4-3-213/B/1, పెద్దపల్లి పట్టణము మరియు జిల్లా.
Cell: 98851 28854, 98493 76681.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, SOMA TRIVENI (Old Name), W/o. Late. KONDLA RAMESH, R/o. H.No. 2-2-47, Main Road, Jammikunta, Karimnagar Dist., T.S.- 505122, have Changed My Name as KONDLA THRIVENI (New Name).
NTW-0366

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

మార్కెట్‌కు సెలవు

మెట్‌పల్లి, మార్చి 22: హోలీ పండుగ సందర్భంగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ఇచ్చినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయ, విక్రయాలు జరుగవని, రైతుల తమ పంట ఉత్పత్తులను ఈ సెలవు రోజుల్లో మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు. ఈ నెల 26 నుంచి యథావిధిగా మార్కెట్‌లో కొనుగోళ్లు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

బస్టాండ్ ప్రారంభం

కోరుట్ల రూరల్, మార్చి 22: యూసుఫ్ నగర్ గ్రామానికి చెందిన మార్గం శోభ తన అమ్మమ్మ సామల్ల గంగుబాయి తండ్రి మార్గం కిషన్ జ్ఞాపకార్థం రూ.50వేలతో బస్టాండ్ నిర్మాణం చేపట్టి శుక్రవారం ప్రారంభించారు. శోభను ప్రజాప్రతినిధులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పుస్తకం అందజేత

జగిత్యాల టౌన్, మార్చి 22: ధర్మపురి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తున్న డాక్టర్ గొల్లపల్లి గణేశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య సాగి కమలాకరశర్మ మార్గదర్శకత్వంలో పరిశోధన చేశాడు. ఆయన రచించిన 'అంతర్జాలంతో తెలుగు భాష సాహిత్యాలు' అనే పుస్తకాన్ని డీఈవో డాక్టర్ జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు. డిగ్రీ, పీజీ స్థాయిలో తెలుగు విద్యార్థులకు ఉపయోగపడే ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ గణేశ్‌ను డీఈవో అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రశంసాపత్రాలు

కొడిమ్యాల, మార్చి 22: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఎస్ఐ సందీప్ శుక్రవారం ప్రశంసాపత్రాలను ఎస్ఐ సందీప్ అందజేశారు. నల్లగొండ గ్రామంలో ఫిబ్రవరిలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి జాతరలో వలంటీర్లు తమ సేవలను అందించినందుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తిరుపతి, అధ్యాపకుడు ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

ధర్మపురి,మార్చి22: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన రటపు నరహరి(55) శుక్రవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ధర్మపురికి వచ్చాడు. గోదావరి స్నానం చేసి ఒడ్డున గల మంగళి గడ్డ ఘాట్ వద్ద కాసేపు విశ్రాంతి కోసం నిద్రించాడు. అయితే నిద్రలోనే గుండెపోటు రావడంతో ఊపిరాడక ఇబ్బందిపడ్డాడు. స్థానికులు 108కు ఫోన్‌చేయగా, వాహనం వచ్చేలోపే నిద్రలోనే మృతి చెందాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.

ఉపాధి పనుల పరిశీలన

మల్యాల, మార్చి 22: మండలంలోని మేజర్ గ్రామపంచాయతీతో పాటు ముత్యంపేటలో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులతో కలిసి డీఆర్డీఏ సంపత్‌రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీల నిర్వహణ, కాం టూర్ కందకాల పనిని పరిశీలించారు. పనిప్రదేశంలో కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్ల ను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో స్వాతి, ఏపీ వో శ్రీనివాస్, ఈసీ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సందోహం.. ధర్మపురి క్షేత్రం

• బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తులు

ధర్మపురి: లక్ష్మీనరసింహస్వామి ఆలయం లోపల క్యూలో భక్తులు

ధర్మపురి, మార్చి 22: ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ(ఉగ్ర, యోగ), వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలతో ధర్మపురి క్షేత్రం భక్తజన సందోహంతో కిటకిటలాడుతున్నది. గురువారం నిర్వహించిన ముగ్గురు స్వాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు రాత్రి క్షేత్రంలోనే బస చేసి శుక్రవారం మరలా స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం యజ్ఞాచార్యులు పురుషోత్తమాచార్యుల మంత్రోచ్చారణల మధ్య పండితులు, అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. పట్టెనామాలు, కోరమీసాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఆవరణలో తాత్కాలిక టెంట్లు వేశారు. గోదావరి నది వద్ద, పుష్కర ఘాట్లపైన చలువ పందిళ్లు వేశారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులను ఏర్పాటు చేశారు. సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కాగా, అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం దాదాపు మూడు వేల మంది భక్తులు వినియోగించుకున్నారు. పట్టణంలోని పాత టీటీడీ కల్యాణమండపంలో ఆర్యవైశ్య సంఘం, రైస్ మిల్లర్లు, దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా స్వామివారి ఊరేగింపు సేవ

మూడో రోజు శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపుసేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సేవపై ఉంచి మేళతాళాల మధ్య దేవస్థానం నుంచి గోదావరి ఒడ్డున గల రామాలయం, పురవీధుల గుండా కోనేరు నుంచి దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, మల్లేశం, సత్యనారాయణ, మొగిలి, పురుషోత్తం, మహేందర్, సాయికిరణ్, గణేశ్, శ్రీకాంత్, మల్లేశ్, సుజాత, పవన్‌కుమార్, శ్రీధర్, పండితులు, అర్చకులు, తదితరులున్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

రాయికల్, మార్చి 22: ఇటిక్యాలలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు జగన్మోహన్ ఆచార్యులు, వేద పండితుడు లక్ష్మణాచార్యుల వేదమంత్రోచ్చారణలతో స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి ఒడిబియ్యం, కుడుకలు, కనుములు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ, సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, మాజీ సర్పంచులు లావణ్య, నారాయణగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, లింబాద్రిగౌడ్, శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు విష్ణు, నాయకుడు చినరాజురెడ్డి, సుజాత, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

కోరుట్ల, మార్చి 22: పట్టణంలోని ఆదర్శనగర్ అష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ స్వామి తిరు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రామాచార్యులు, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

జగిత్యాల, మార్చి 22: జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆలయంలో పండితుడు నంబి వేణుగోపాలాచార్య కౌశిక పర్యవేక్షణలో తొమ్మిదో వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం, లక్ష్మీనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ గరిపెల్లి శశికుమార్, డాక్టర్ వందన ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు చేయాలి

రాయికల్, మార్చి 22: అయోధ్య గ్రామంలోని రామాలయంలో జరిగే రాములోరి కల్యాణానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న రామాలయంలో ఫ్లోరింగ్ పనులు, ఆలయం ఎదుట సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.

గ్రామాల్లో డ్రైడే

కోరుట్ల రూరల్, మార్చి 22: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని పేర్కొన్నారు. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెందుతాయని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి: ఎస్పీ

పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

పెగడపల్లి, మార్చి 22: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసులకు సూచించారు. శుక్రవారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల రికార్డులు, రిసెప్షన్, కంప్యూటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్ గదులను తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గంజాయి, గుడుంబా నిర్మూలనను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పని సరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ జాడి రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ

కొడిమ్యాల/కథలాపూర్/ధర్మపురి/ధర్మపురి రూరల్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు డబ్బు, మద్యం రాకుండా సరిహద్దుల్లో పకడ్బందీగా పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దొంగలమర్రి వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు పోలీస్ చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు. అలాగే ధర్మపురి మండలం రాయపట్నం చెక్‌పోస్టును అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కథలాపూర్ మండలం కలికోట గ్రామశివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ శుక్రవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు రికార్డులను పరిశీలించారు.

పట్టుబడ్డ రూ.69వేలు

ఇబ్రహీంపట్నం, మార్చి 22: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ శివారులోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో రూ.69వేలు పట్టుబడినట్లు ఎస్ఐ అనిల్ శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ నుంచి మెట్‌పల్లి వెళ్తున్న ఓ కారులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.69వేల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మూల్యాంకన భత్యాన్ని చెల్లించాలి

జగిత్యాల, మార్చి 22: జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలోని మూల్యాంకన భత్యాన్ని ఇప్పటివరకు చెల్లించలేదని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు డీఈవో జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

అధికారుల తనిఖీలు

కోరుట్ల, మార్చి 22: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ షాపులు, వాటర్ ప్లాంట్‌లలో శుక్రవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు. ఈసందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు క్రయ, విక్రయాలు జరుపుతున్న దుకాణా యజమానులకు జరిమానా విధించారు. శుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే వాటర్ ప్లాంట్ యజమానులు వినియోగదారులకు శుభ్రం చేసిన బాటిళ్లలో మాత్రమే నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఐఎస్ఐ లైసెన్స్ లేకుండా వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, రమేశ్, రాజు, తదితరులున్నారు.

తప్పని సరిగా ఓటు వేయాలి

• స్వీప్ నోడల్ అధికారి మదన్
• సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్లకు అవగాహన

జగిత్యాల: కలెక్టరేట్‌లో ప్లకార్డులతో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

జగిత్యాల, మార్చి 22: రాబోయే ఎన్నికల్లో అందరూ తప్పని సరిగా ఓటు వేయాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి మదన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సంక్షేమ అధికారి కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీఆర్డీవో, స్వీప్ నోడల్ ఆఫీసర్ మదన్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదు కావాలన్నారు. ఏమైనా అవకతవకలు జరిగినప్పుడు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే, పేరు బయటపడకుండా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం ఓటర్ అవగాహన ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఓటర్ లిస్ట్‌లో పేరు ఉందో..? లేదో తెలుసుకోవాలని, లేకుంటే ఏప్రిల్ 10లోపు నమోదు చేసుకోవాలని, లేదా బీఎల్‌వోకు దరఖాస్తు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో వయోవృద్ధులకు సేవలు అందిస్తున్న వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పెగడపల్లి/మల్లాపూర్/కోరుట్ల రూరల్/కోరుట్ల/రాయికల్/ఇబ్రహీంపట్నం, మార్చి 22: పెగడపల్లి, మల్లాపూర్ మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో, కోరుట్ల రూరల్ మండలం అయిలాపూర్, రాయికల్ మండలం ఇటిక్యాల, కోరుట్ల, ఇబ్రహీంపట్నంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై శుక్రవారం అధికారులు అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రలోభాలకు లొంగి పోకుండా, అందరూ ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్లు శ్రీనివాస్, వీర్‌సింగ్, ఖయ్యుమ్, ఎంపీవో మహేందర్ కోరారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేశ్, గిర్దవార్ శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, ఆశవర్కర్లు, మహిళా సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల: కల్లూరు రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

• నిధులు మంజూరు చేయాలని వినతి

రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్, మార్చి 22: జగిత్యాల నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని జగిత్యాల పట్టణంలో నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇండ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గతంలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు ఉన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

• జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్

గొల్లపల్లి/మేడిపల్లి,మార్చి 22: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు తప్పక వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేశ్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రతీ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సిబ్బందికి వ్యాక్సిన్ విధానం ఆన్‌లైన్ నమోదు విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు. మేడిపల్లి మండలం కల్వకోటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువుల డాక్టర్ వెన్నెల, జేవీవో సురేఖ, వీఏ లచ్చయ్య పాల్గొన్నారు.

ప్రదీప్‌కు శివాజీ మహరాజ్ పురస్కారం

సేవా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ప్రదీప్

పెగడపల్లి, మార్చి 22: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ బత్తుల ప్రదీప్, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్తమ సేవా పురస్కార్-2024 అవార్డు అందుకున్నాడు. వివిధ రంగాల్లో సేవలందించిన సమాజ సేవకుడు డాక్టర్ ప్రదీప్‌కు మోక్ష గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన వేడుకల్లో అవార్డు అందజేశారు. కాగా, ప్రదీప్ గత సంవత్సరం డాక్టరేట్ కూడా అందుకున్నాడు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌ను పలువురు అభినందించారు.

గోదావరి నదిలో పడి పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి 22: బర్రెలు మేపుతూ ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని వాల్గొండ గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన పుట్ట గంగారాం(55), ఆయన కుమారుడు సురేశ్‌తో కలిసి బర్రెలను మేపడానికి గ్రామశివారులోని గోదావరి నది తీరప్రాంతానికి వెళ్లాడు. బర్రెలు గోదావరి నది వైపు వెళ్తున్న క్రమంలో నదిలోకి వెళ్లిన గంగారాం ప్రమాదవశాత్తు ఓ మడుగులో కాలు జారి నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోషణ్ పక్షోత్సవాలు

సారంగాపూర్: పోషణ్ పక్వాడాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కోరుట్ల రూరల్/జగిత్యాల రూరల్/సారంగాపూర్, మార్చి 22: కోరుట్ల రూరల్ మండలం అయిలాపూర్, పైడిమడుగు, జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి 1,2 అంగన్‌వాడీ కేంద్రాలు, సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు శుక్రవారం పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ మేరకు మహిళలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలిచ్చారు. అలాగే పెరటి తోటల పెంపకంలో మహిళలకు ఉపయోగపడే పలు ఆకు కూరగాయలు, తల్లిపాల ప్రాముఖ్యత, నీటి వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం

మెట్‌పల్లి రూరల్: ఆత్మనగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కొడిమ్యాల/మెట్‌పల్లి రూరల్, మార్చి 22: కొడిమ్యాల మండలకేంద్రంలోని ఏడో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం, పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. స్వచ్ఛమైన నీటిని తాగాలన్నారు. చిరుధాన్యాలు తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనసూయ, హెల్పర్ రజిత, తల్లులు తదితరులు ఉన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో అధికారులు ఇంటింటికీ వెళ్లి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం నీటిని వృథా చేయమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్, ఏఎన్ఎం వసంత పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కొడిమ్యాల, మార్చి 22: విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని తహసీల్దార్ రాజమణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కరీంనగర్‌కు చెందిన వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేకా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు గురువులు, తల్లిదండ్రులపై గౌరవం ఉండాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ సందీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపీకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, మార్చి 22: ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంస్థలు అందిస్తున్న సేవలను గ్రామాల్లోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ఆర్గనైజర్ వర్ధిని సూచించారు. శుక్రవారం చిట్టాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్, తదితర వృత్తి విద్య కోర్సులపై ఉచితంగా శిక్షణను అందించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఇక్కడ సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్, అంగన్‌వాడీ టీచర్లు స్నేహ, లావణ్య, స్వరూప, శ్రీదేవి పాల్గొన్నారు.